క్లుప్తంగా

కోర్టు ఆవరణ పరిశీలన



కోర్టు ఆవరణలో పరిశీలిస్తున్న మెజిస్ట్రేట్ వెంకటేశ్వర్లు, జీఎం రామచందర్

మణుగూరురూరల్: మండలంలోని మణుగూరు ప్రథమశ్రేణి జ్యుడిషియల్ కోర్ట్ ఆవరణాన్ని మెజిస్ట్రేట్ ఎం.వెంకటేశ్వర్లు, సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మెజిస్ట్రేట్ సమక్షంలో బార్ అసోసియేషన్ సభ్యులు పలు సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. సానుకూలంగా స్పందించి జీఎం రామచందర్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మణుగూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు, డీజీఎం పర్సనల్ ఎస్.రమేష్, ఏజీఎం సివిల్ వెంకటేశ్వర్లు, ఇంజనీర్ నర్సిరెడ్డి, సెక్యూరిటీ అధికారి షబ్బీరుద్దీన్, న్యాయవాదులు రమణారెడ్డి, విజయరావు, సాంబ, అన్వేష్, రుద్ర వెంకట్, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఫలితాలు సాధించాలి

మణుగూరురూరల్: పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియా జీఎం దుర్గం రామచందర్ అన్నారు. మంగళవారం సింగరేణి హైస్కూల్‌లో ఫేర్‌వెల్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జీఎం రామచందర్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేసి మాట్లాడారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. జీఎంను పాఠశాల యాజమాన్యం శాలువాతో సన్మానించింది. పాఠశాల కరస్పాండెంట్, డీజీఎం(పర్సనల్) ఎస్.రమేష్, హెచ్ఎం స్వరూపారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సీపీఎం ఆందోళన

బూర్గంపాడు: సుప్రీంకోర్టు ఆదేశానుసారం ఎన్నికల బాండ్ల వివరాలను వెంటనే విడుదల చేయాలని సారపాకలోని ఎస్‌బీఐ ఎదుట మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎన్నికల బాండ్ల వివరాలను వెల్లడించడానికి ఎస్‌బీఐ సమయం కోరడంతో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. బయ్యా రాము, ఎస్‌కె.అబీదా, మరియమ్మ, మీనా, లక్ష్మి, నాగమణి, వెంకటమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆలయ దాతలకు సన్మానం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని పాత మామిళ్లవారిగూడెం గ్రామంలో ఉన్న కాకతీయుల కాలం నాటి దుర్గమల్లేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కోసం విరాళాలను అందించిన దాతలను ఘనంగా సన్మానం చేశారు. మంగళవారం ఆలయం వద్ద జరిగిన మహాశివరాత్రి జాతర ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆలయ అభివృద్ధి కోసం కృషి చేసిన వారికి, విరాళాలను అందించిన 21 మందికి శాలువ కప్పి, జ్ఞాపికలను అందించారు. అశ్వారావుపేట సొసైటీ చైర్మన్ చిన్నంశెట్టి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు జూపల్లి రమేష్, జూపల్లి రమేష్, మొడియ సూర్యచంద్రరావు, మాజీ సర్పంచ్ మొడియం నాగమణి, ఆలయ కమిటీ బాధ్యులు పాల్గొన్నారు.

14న ముందస్తు లోక్ అదాలత్

దమ్మపేట: ఈ నెల 14 వ తారీకు దమ్మపేట కోర్ట్‌లో జరిగే ముందస్తు జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక ఎస్సై సాయికిషోర్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. లోక్‌అదాలత్‌లో కేసులు రాజీ చేసుకోవచ్చన్నారు. యాక్సిడెంట్, సివిల్, చీటింగ్, భూతగాదాలు, వివాహ, బ్యాంకు, కుటుంబ తగాదాలకు సంబంధించిన కేసుల విషయంలో లోక్‌అదాలత్‌లో రాజీ చేసుకుని, కేసును పరిష్కరించుకోవచ్చని తెలిపారు.

హక్కులను కాపాడుకోండి

భద్రాచలంటౌన్: భారత రాజ్యాంగం ఆదివాసీలకు కల్పించిన హక్కులను కాపాడుకోవాలని ఆదివాసీ కొండరెడ్ల సంఘం వ్యవస్థాపక గౌరవ అధ్యక్షుడు ముర్ల రమేష్ అన్నారు. స్థానిక సమ్మక్క–సారక్క ఫంక్షన్ హాల్‌లో మంగళవారం జరిగిన ఆదివాసీ కొండరెడ్ల సంఘం జాతీయ మహాసభలను ఆయన ప్రారంభించారు. ముందుగా రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్, ఆదివాసీ అమర వీరులు గంటం దొర, గాం దొర, అల్లూరి సీతారామరాజు, కిమరం భీమ్ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మహాజభలో రమేష్ మాట్లాడుతూ.. అడుగడుగునా ఆదివాసీలకు అన్యాయం జరుగుతుందని, అనేక ఉద్యమాలు, పోరాటాలు చేస్తున్న పాలకులు పట్టించుకోకపోవడం బాధాకరం అన్నారు. ప్రభుత్వాలు ఆదివాసుల అస్తిత్వాన్ని కాపాడటం కోసం చిత్తశుద్ధితో చట్టాలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో వెట్ల సీతమ్మ, సైత్రు రామారావురెడ్డి, కథల రామిరెడ్డి, గురుగుంట్ల బాబురెడ్డి, ముర్ల జగపతిరెడ్డి, లక్ష్మణ్‌రెడ్డి, కెచ్చెల గంగిరెడ్డి, కెచ్చల భవాని తదతరులు పాల్గొన్నారు.

రైతు వేదికలకు హంగులు

- వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాట్లు పూర్తి
- ప్రత్యేక సాంకేతిక వ్యవస్థతో అనుసంధానం
- సాగుపై అందనున్న తక్షణ సమాచారం



బూర్గంపాడు రైతు వేదికలో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన రైతులు..

బూర్గంపాడు: రైతు వేదికలు ఆధునిక హంగులను సంతరించుకుంటున్నాయి. ప్రత్యేక సాంకేతిక వ్యవస్థలతో రైతులను అనుసంధానం చేసేందుకు వ్యవసాయశాఖ చర్యలు తీసుకుంటుంది. గత ప్రభుత్వం పంటల సాగులో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు నిర్మించిన రైతు వేదికలను ప్రస్తుత ప్రభుత్వం సాంకేతిక హంగులతో అభివృద్ధి చేస్తుంది. పంటల సాగులో రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు శాస్త్రవేత్తలు, వ్యవసాయ అధికారులతో నేరుగా పొలంలో ఉండే మాట్లాడేందుకు అనువుగా వీడియో కాన్ఫరెన్స్ వ్యవస్థను ప్రభుత్వం తీసుకువచ్చింది.

రైతు వేదికలను పూర్తిస్థాయిలో వినియోగం తీసుకువచ్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. పంటల సాగులో నూతన సాంకేతిక విధానాలను రైతులకు సత్వరం అందించేందుకు రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్‌ను అమలు చేస్తున్నారు. తొలివిడతగా నియోజకవర్గంలోని ఓ రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ సిస్టంను ఏర్పాటు చేశారు. ఇటీవలే రాష్ట్ర ముఖ్యమంత్రి, వ్యవసాయశాఖ మంత్రులు హైదరాబాద్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం నుంచి ఈ వీడియో కాన్ఫరెన్స్‌తో రైతులతో మాట్లాడారు. రైతులు పొలంలో ఉండి పంటల సాగులో ఉన్న అనుమానాలను నివృత్తి చేసుకునేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు వీడియో కాన్ఫరెన్స్‌తో రైతులో మాట్లాడటంతో పాటుగా పంటల సస్యరక్షణకు తీసుకోవాల్సిన చర్యలను వివరిస్తారు.

ఒక్కో రైతు వేదికలో రూ.3.75 లక్షల వ్యయంతో వీడియో కాన్ఫరెన్స్ వ్యవస్థను ప్రభుత్వం ఏర్పాటు చేసింది.ఈ నిధులతో 65 ఇంచుల ఎల్ఈడీ టీవీ, ఇన్వర్టర్, సౌండ్ బాక్స్‌లు, సెట్‌టాప్ బాక్స్‌లు, ఇతర సామాగ్రిని ఏర్పాటు చేశారు. వీడియో కాన్ఫరెన్స్ సిస్టమ్ నిర్వహణకు కూడా ప్రతినెల బడ్జెట్ కేటాయించారు. బీఎస్ఎన్ఎల్ ఆధీనంలోని టీ ఫైబర్ నెట్‌వర్క్‌ను వినియోగించుకుంటున్నారు. తొలివిడతగా నియోజకవర్గానికి ఓ రైతువేదికలో వీడియో కాన్ఫరెన్స్ సిస్టంను ఏర్పాటు చేసిన ప్రభుత్వం దశలవారీగా అన్ని రైతు వేదికలలో ఈ సాంకేతిక వ్యవస్థను ఏర్పాటు చేయనుంది. గత వారం రోజుల వ్యవధిలో రెండుసార్లు వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు వ్యవసాయ శాస్త్రవేత్తలు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు సలహాలు, సూచనలు అందించారు. మంగళవారం మామిడి పూత సంరక్షణపై శాస్త్రవేత్తలు రైతులకు తగు సూచనలు, సలహాలు అందించారు.

ధాన్యం, అపరాలు, ఇతర వాణిజ్య పంటల సాగుతో పాటుగా ఉద్యానవన పంటల సాగులో తీసుకోవాల్సిన శాస్త్ర సాంకేతిక అంశాలను ఎప్పటికప్పుడు రైతులకు ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రైతులకు అందించనున్నారు. అదేవిధంగా రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తుల నిల్వ, మార్కెటింగ్ అంశాలను కూడా వివరించనున్నారు. వ్యవసాయ అనుబంధ పాడిపరిశ్రమ, పౌల్ట్రీ రంగాల్లో కూడా సాంకేతిక అంశాలను రైతులకు అందించేందుకు కాన్ఫరెన్స్ ఉపయోగపడుతుంది. సేంద్రీయ పంటల సాగు, నాణ్యమైన వ్యవసాయ ఉత్పత్తులు, భూసార పరిరక్షణ వంటి కీలక విషయాలను అందిస్తూ నూతన సాంకేతికతను, సాగు పద్ధతులను ఈ వీడియో కాన్ఫరెన్స్‌లలో రైతులకు అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రైతులకు మేలు..

రైతు వేదికలలో వీడియో కాన్ఫరెన్స్ సిస్టం తీసుకురావటంతో రైతులు తమ సందేహాలను నివృత్తి చేసుకునేందుకు నేరుగా వ్యవసాయ శాస్త్రవేత్తలు, ఉన్నత అధికారులతో మాట్లాడవచ్చు. పంటల సాగులో ఎదురయ్యే సమస్యలను శాస్త్రవేత్తలకు వివరించి, తద్వారా పరిష్కారాలను తెలుసుకునే వీలు కలుగుతుంది.

– బి.తాతారావు, ఏడీఏ, మణుగూరు

సద్వినియోగం చేసుకోవాలి

ప్రభుత్వం తీసుకువచ్చిన వీడియో కాన్ఫరెన్స్ సిస్టంను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. వీడియో కాన్ఫరెన్స్‌లలో రైతులు పాల్గొనటం వల్ల క్షేత్రస్థాయిలో వారికి ఎదురవుతున్న సమస్యలను శాస్త్రవేత్తలకు వివరించే వీలుకలుగుంది. వారి ద్వారా అందే సలహాలు, సూచనలతో సత్వర సస్యరక్షణ చర్యలు తీసుకోవచ్చు.

– శంకర్, ఏఓ, బూర్గంపాడు

ఎమ్మెల్యే విస్తృత పర్యటన



పారతో పనిచేస్తున్న ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

దమ్మపేట: ప్రజాక్షేత్రంలోనే ఉండి, వారి అవసరాలు, బాగోగులను తెలుసుకుంటూ, ప్రజల వద్దకే సంక్షేమ పాలన అందిస్తానని, స్థానిక ఎమ్మెల్యే జారే ఆదినారాయణ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. మండలంలోని నాచారం, మొద్దులగూడెం, నాయుడుపేట, వెంకటాద్రిగూడెం, ముష్టిబండ, వడ్లగూడెం, రంగువారిగూడెం, మందలపల్లి, దమ్మపేట గ్రామాల్లో పర్యటించిన ఎమ్మెల్యే.. లబ్ధిదారుల ఇంటివద్దకే నేరుగా వెళ్లి కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు, ఇటీవలే మృతి చెందిన వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, భరోసానిచ్చారు. కూలీలను పలకరించి, వారితో కలసి పారతో పనిచేశారు. మొత్తం 52 మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ నరేష్, ఎంపీపీ సోయం ప్రసాద్, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు హెల్మెట్లు పంపిణీ

భద్రాచలంఅర్బన్: భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న 20 మంది పోలీస్ సిబ్బందికి మంగళవారం భద్రాచలం టౌన్ సీఐ సంజీవరావు హెల్మెట్లు, కళ్లజోళ్ల పంపిణీ చేశారు. భద్రాచలం ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీఐ సంజీవరావు మాట్లాడుతూ.. వేసవి కాలంలో ద్విచక్ర వాహనం నడిపే సమయంలో ట్రాఫిక్ పోలీసులు ఎండ వేడికి అనారోగ్యం పాలు కాకుండా, రోడ్డు భద్రత ఉండేటట్లు అందించినట్లు తెలిపారు. దీనివల్ల పోలీసులను ఉదాహరణకు తీసుకుని ప్రజలు కూడా హెల్మెట్లు ఉపయోగిస్తారని ఆయన తెలిపారు. కార్యక్రమానికి సహాయ సహకారం అందించిన ట్రాఫిక్ ఎస్సై మధు ప్రసాద్‌ను సీఐ అభినందించారు. అనంతరం భద్రాచలం పట్టణంలో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్న సీసీ కెమెరాలకు గాను మార్కెట్ యార్డ్ ఆటో యూనియన్ సభ్యులు టౌన్ ఎస్సై మధు ప్రసాద్‌కు రూ.7వేలు నగదును వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ సభ్యులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు హెల్మెట్లు అందజేస్తున్న సీఐ సంజీవరావు

సభకు తరలిన బీజేపీ శ్రేణులు

అశ్వాపురం: హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా హాజరైన విజయ సంకల్ప సమ్మేళన సభకు మండలంలోని బీజేపీ నాయకులు, కార్యకర్తలు మంగళవారం తరలివెళ్లారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మహబూబాబాద్ పార్లమెంట్ కన్వీనర్ ముస్కు శ్రీనివాసరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి తాటిపాముల అయిలయ్య, నియోజకవర్గ కన్వీనర్ పున్నం భిక్షపతి, ఈసాల వెంకటేశ్వర్లు, ముత్యాల వెంకటేశ్వర్లు, సారయ్య, రామారావు, గోసుల రాములు, కృష్ణకుమారి, భాస్కర్, సుధాకర్ రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భద్రాచలంటౌన్: హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో మంగళవారం నిర్వహిస్తున్న బీజేపీ విజయ సంకల్ప సమ్మేళనం సభకు భద్రాచలంలోని ఆ పార్టీ నాయకులు కదలి వెళ్లారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా పాల్గొనే ఈ సభకు భద్రాచలం డివిజన్ నుంచి ఏర్పాటు చేసి బస్సును బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ కుంజా ధర్మ జెండా ఊపి ప్రారంభించారు. కార్యక్రమంలో త్రినాథ్‌రావు, క్రాంతి, సతీష్, మోహన్, కోటేశ్వరి, కన్నయ్య, చిన్నయ్య, శ్రీను, శ్రీనివాస్, నిఖిల్ సాయి, త్రినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు బంగారు పతకాలు



బంగారు పతకాలు సాధించిన క్రీడాకారులు

భద్రాచలంటౌన్: భద్రాచలం పట్టణంలోని సిటీ స్టైల్ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మూడు బంగారు పతకాలు ఒక సిల్వర్ పతకం సాధించిన్నట్లు జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ జీవి రామిరెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈనెల 9 నుంచి 11 వరకు హైదరాబాద్‌లోని చందానగర్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో సిటీ స్టైల్‌కు జిమ్‌కు చెందిన క్రీడాకారులు 69 కిలోల విభాగంలో మామిడి భూమికకు సిల్వర్ పతకం, మాస్టర్–2, 74 కిలోల విభాగంలో మహంతి వెంకటకృష్ణ బంగారు పతకం, మాస్టర్–4, 83 కిలోల విభాగంలో గొర్రె దుర్గేశ్వరరావు బంగారు పతకం, మాస్టర్–4, 105 కిలోల విభాగంలో గాలి రామ్మోహన్‌రావు బంగారు పతకాలను కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పలువురు క్రీడాకారులు, రాజకీయ నాయకులు, ప్రముఖులు అభినందనలు తెలిపారు.

ఓటు హక్కుపై అవగాహన

అన్నపురెడ్డిపల్లి: ఓటు హక్కుపై ఎంపీడీఓ మహాలక్ష్మి అవగాహన కల్పించారు. మంగళవారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో ఐకేపీ మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి, ఓటు హక్కుపై ప్రాముఖ్యతను వివరించారు. ఓటు హక్కు వజ్రాయుధంలాంటిదని, ఓటు హక్కును అర్హులైన ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలన్నారు. ఏపీఓ ప్రమీలా, పంచాయతీ సెక్రటరీ ఖాదర్, ఐకేపీ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

భూమి పూజ

చండ్రుగొండ: మండలంలోని గానుగపాడు మంగయ్యబంజర్ గ్రామాల మధ్య బ్రిడ్జి నిర్మాణ పనులకు ఎంపీపీ బాణోత్ పార్వతి మంగళవారం భూమిపూజ చేశారు. బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ రాజీ, సొసైటీ చైర్మెన్ చెవుల చందర్‌రావు, కాంగ్రెస్‌పార్టీ నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్, మాజీ ఎంపీపీ గుగులోతు బాబు, ఇంజం అప్పారావు, టి.సురేష్ పాల్గొన్నారు.

సేవాగుణం అలవర్చుకోవాలి

కరకగూడెం: సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాగుణం అలవర్చుకుని ముందుకు సాగాలని కరకగూడెం తహసీల్దార్ నాగప్రసాద్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన మంగళవారం స్థానిక పీహెచ్‌సీకి అఖండ హిందూ సంస్థ ఆధ్వర్యంలో రోగుల సౌకర్యార్థం కుర్చీలు, తల దిండ్లు వితరణగా అందజేశారు. అనంతరం మాట్లాడుతూ... సేవతోనే ప్రజల్లో గుర్తింపు వస్తుందని, ప్రతి ఒక్కరూ ఏదో రూపంలో సేవా కార్యక్రమాలు చేయాలన్నారు. కార్యక్రమంలో దాతలు సిరిశెట్టి కమలాకర్–సుజాత దంపతులు, వైద్యాధికారి కారం మధు, సంస్థ సభ్యులు కట్ల నరేష్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

అశ్వాపురం: మండల పరిధిలోని సండ్రలబోడు గ్రామ పంచాయతీలోని బండ్లసిరి గుట్టపై ఉన్న శ్రీదేవి భూదేవి సమేత అభయ వెంకటేశ్వరస్వామి 18వ వార్షిక కల్యాణ మహోత్సవ కరపత్రాలను మంగళవారం ఆలయం సన్నిధిలో ఆవిష్కరించారు. ఈ నెల 23 నుంచి 27 వరకు కళ్యాణ మహోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ నెల 25న స్వామి వారి కళ్యాణం నిర్వహించనున్నారు. కల్యాణ మహోత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని తమ వంతు సహాయ సహకారాలు అందించాలని ఆలయ కమిటీ వారు కోరారు. ఈ కార్యక్రమంలో దేవుడమ్మ, గాదె ప్రతాపరెడ్డి, తెల్లం నాగరాజు, చింతల లింగయ్య, భూక్యా మంగీలాల్, ఎక్కటి భాస్కర్‌రెడ్డి, ఆసా శ్రీనివాసరావు, పసుపులేటి శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

సీఎంకు కృతజ్ఞతలు

భద్రాచలంటౌన్: తెలంగాణ రాష్ట్రంలో మున్నూరు కాపు కార్పొరేషన్ ఏర్పాటుకు మంగళవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఆమోదం తెలపడంపై భద్రాచలం మున్నూరు కాపు సంఘం నాయకులు సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా మున్నూరు కాపు సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ పిన్నింటి రాజశేఖర్ మాట్లాడుతూ.. కాపు కార్పొరేషన్ విషయంలో సంఘం అధ్యక్షుడు దేవయ్య పటేల్ విజయం సాధించారన్నారు.

రంజాన్ మాసం ప్రారంభం



కరకగూడెంలోని జామా మసీదులో ఇఫ్తార్ చేస్తున్న ముస్లింలు

కరకగూడెం: రంజాన్ మాసం ముస్లింలకు అత్యంత పవిత్రమైనది. ఈ మాసంలో చేసే ప్రతి ఆధ్యాత్మిక కార్యక్రమం ఎన్నో రెట్ల ఫలితాలను అందిస్తుందని వారి విశ్వాసం. అల్లాహ్ ఆశీస్సులు అందించే పవిత్ర రంజాన్ కోసం ముస్లింలు సంవత్సరమంతా ఎదురుచూస్తుంటారు. సోమవారం సాయంత్రం ఆకాశంలో నెల పొడుపు కనిపించగా ఈ ఏడాది రంజాన్ మాసం ప్రారంభం అవ్వగా మంగళవారం నుంచి ఉపవాస దీక్షలను ముస్లింలు చేపట్టారు. రోజా పాటించే ముస్లింలు నమాజ్‌కు మొదటి ప్రాధాన్యతనిస్తారు. నమాజ్ కోసం అన్ని మసీదుల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. సూర్యోదయానికి ముందు(సహర్) నుంచి సూర్యాస్తమయం(ఇఫ్తార్) వరకు ఉపవాసదీక్షలు పాటిస్తారు. రోజుకు ఐదుపూటల నమాజు చేస్తారు. దీనికి అదనంగా రాత్రి 8.30 నుంచి 10గంటల వరకు సాగే 'తరావీహ్'నమాజులో ఖురాన్ పఠనం చేస్తారు. అంతేకాకుండా దానధర్మాలకు అధిక ప్రాధాన్యం ఇస్తారు.

రంజాన్ గంజి షురూ..

అశ్వారావుపేట: రంజాన్ మాసంలో ఉపవాస దీక్షాపరులకు శక్తినిచ్చే గంజి గురించి అందరికీ తెలిసిందే. అశ్వారావుపేట మసీద్‌లో రంజాన్ ఉపవాస దీక్ష మొదటి రోజే దీక్షాపరుల కోసం గంజిని సిద్ధం చేశారు. దీంతో భక్తులు సంతోషాన్ని వ్యక్తం చేశారు.



అశ్వారావుపేట మసీదులో సిద్ధం అవుతున్న గంజ

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



దుమ్ముగూడెం: చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వెంకట్రావు, ఎంపీపీ, జెడ్పీటీసీ

మణుగూరురూరల్: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను స్థానిక ప్రజాభవన్‌లో మంగళవారం పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి రూ.1,00,116ల చొప్పున 16మంది లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.కార్యక్రమంలో ఎంపీటీసీ గుడిపూడి కోటేశ్వరరావు, కాంగ్రెస్ మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, డిటి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

దుమ్ముగూడెం: మండలంలోని లక్ష్మీనగరం గ్రామంలోని మండల అభివృద్ధి కార్యాలయంలో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు చెక్కులను మంగళవారం పంపిణీ చేశారు. మండలంలోని 27 మంది కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేద యువతి తల్లిదండ్రులకు ఈ కల్యాణలక్ష్మి పథకం అసరాగా ఉంటుందని అన్నారు. అలాగే తహసీల్దార్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పర్యటనలో భాగంగా మండలానికి చెందిన ఐదుగురికి ఇందిరమ్మ ఇళ్లు పంపిణీకి శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ రేసు లక్ష్మి, జెడ్పీటీసీ తెల్లం సీతమ్మ, గిర్దవార్లు ఆదినారాయణ, లక్ష్మయ్య, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వేలం పాటతో ఆదాయం

అశ్వారావుపేటరూరల్: మండలంలోని వినాయకపురం గ్రామంలోని చిలకలగండి ముత్యాలమ్మ తల్లి ఆలయానికి వేలం పాటల ద్వారా రూ.3 లక్షలకు పైబడిన ఆదాయం సమకూరింది. మంగళవారం దేవదాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో ఆలయం ఆవరణలో వివిధ దుకాణాల ఏర్పాటు కోసం వేలం పాటలను నిర్వహించారు. ఈ వేలం పాటల్లో దుకాణాలను దక్కించుకునేందుకు పలువురు వ్యాపారులు పోటీ పడ్డారు. దాంతో కొబ్బరి కాయల దుకాణాన్ని రౌతుల పద్మావతి అనే వ్యాపారి రూ.1,02,000 రూపాయాలకు, కొబ్బరి చిప్పల సేకరణ పాటను పర్సా నాగరాజు అనే వ్యాపారి రూ.35వేలకు, పులిహోర, లడ్డూ విక్రయాలను దాసరి జయలక్ష్మి అనే వ్యాపారి రూ.16వేలకు, అరవ శ్రీరామ్ అనే వ్యాపారి ఐస్‌క్రీమ్, కూల్ డ్రింక్స్ దుకాణాన్ని రూ.1,60,000కు దక్కించుకున్నారు. ఈ వేలం పాటల ద్వారా మొత్తం ఆలయానికి రూ.3.13 లక్షల ఆదాయం సమకురింది. ఆలయ ఈవో సూర్యప్రకాశ్ మాట్లాడుతూ.. వేలం పాటల ద్వారా దక్కించుకున్న దుకాణాలను వచ్చే నెల 5వ తేదీ నుంచి 11వ తేదీ వరకు జరిగే అమ్మ వారి జాతర ఉత్సవాల్లో మాత్రమే ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుందని, ఈ దుకాణాల కాల పరిమితి ఆ ఏడు రోజులు మాత్రమేనని తెలిపారు.

మృతుడి కుటుంబానికి చేయూత

అశ్వాపురం: అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో మణుగూరులో రాహుల్‌గాంధీ రోడ్‌షోకు వెళ్తుండగా నవంబర్ 18న అశ్వాపురం మండలం కల్యాపురంలో ట్రాక్టర్ బోల్తా పడి మృతి చెందిన జగ్గారం వాసి, కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సోడె వెంకటేశ్వర్లు కుటుంబానికి మంత్రి పొంగులేటి, ఎమ్మెల్యే పాయం, డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య అండగా నిలిచారు.

మృతుని కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని వెంకటేశ్వర్లు మృతదేహానికి నివాళులర్పించిన రోజు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, పాయం వెంకటేశ్వర్లు, బ్రహ్మయ్య హామీ ఇచ్చారు. ఎన్నికల తరువాత డిసెంబర్ 30న మృతుని కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. తాజాగా భద్రాచలంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రారంభం సందర్భంగా వెంకటేశ్వర్లు భార్య సోడె సత్తెమ్మకు సీఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ఇందిరమ్మ ఇంటి పట్టా అందజేశారు. హామీ ఇచ్చి మాట నిలబెట్టుకున్న పొంగులేటి, పాయం, బ్రహ్మయ్యకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



సత్తెమ్మకు ఇందిరమ్మ ఇంటి పట్టా అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

50 అడుగుల వెడల్పు ఉండాల్సిందే..

ములకలపల్లి: ములకలపల్లిలో విస్తరిస్తున్న రోడ్డు 50 అడుగుల వెడల్పు ఉండాల్సిందేనని సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు నరాటి ప్రసాద్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో మంగళవారం వామపక్ష పార్టీలు ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ములకలపల్లిలో సెంట్రల్ లైటింగ్ పనుల నిమిత్తం గత ప్రభుత్వ హయాంలో నిధులు మంజూరయ్యాయని అన్నారు. వీటిలో భాగంగా డివైడర్, సెంట్రల్‌లైటింగ్, ఫోర్‌లైన్ బీటీ రోడ్డు నిర్మించాల్సి ఉందన్నారు. ఎస్టిమేట్, ఆర్అండ్‌బీ శాఖ నిబంధనల ప్రకారం రోడ్డుకిరువైపులా 50 అడుగులమేర పనులు చేపట్టాల్సి ఉండగా.. కొంతమేర వెడల్పు తగ్గిస్తున్నారని ఆరోపించారు. కొంతమంది వ్యక్తుల స్వప్రయోజనాల కోసం అభివృద్ధిని అడ్డుకోవడం దురదృష్టకరమన్నారు. రానున్న రోజుల్లో వాహనాల వినియోగం, జనాభా పెరుగుదల తదితర అంశాలను దృష్టిలో ఉంచుకొని ఖచ్చితంగా 50 అడుగుల వెడల్పుతో పనులు చేపట్టాలని అధికారులను కోరారు. సమావేశంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా నాయకులు నూపా భాస్కర్, సీపీఎం, సీపీఐ మండల కార్యదర్శులు ముదిగొండ రాంబాబు, ఎండీ.యూసఫ్, నిమ్మల మధు, వీరూనాయక్, నరాటి రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ విషజ్వరాల విజృంభణ

చర్లరూరల్: చర్ల ఏజెన్సీలో విష జ్వరాలు మళ్లీ విజృంభిస్తున్నాయి. మండలంలో ఎక్కడ చూసినా జ్వరాలతో బాధపడుతూ ఒళ్ళు, కీళ్ళ నొప్పులతో నడవలేని స్థితిలో ఆస్పత్రుల్లో చేరుతున్నారు. నిన్న, మొన్నటి దాకా కలివేరు, కొత్తపల్లి, రాళ్ళగూడెం గ్రామాల్లో విష జ్వరాల ప్రభావం అధికంగా ఉండేది. కానీ ఆయా ప్రాంతాలకే పరిమితమైన వైరల్ ఫీవర్స్ ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల్లో విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. దీంతో మండలంలో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. చిన్న పిల్లల దగ్గర నుండి వృద్ధుల వరకు పలువురు కీళ్ళ నొప్పులతో తీవ్రంగా బాధపడుతున్నారు. కొత్తపల్లి గ్రామంలో జ్వరాలు తగ్గినట్లే తగ్గి మళ్లీ పెరుగుతున్నాయి. అంతేకాకుండా ప్రస్తుతం చర్ల పట్టణం, పాతచర్లతో పాటు తిప్పాపురం,లెనిన్ కాలనీ, లక్ష్మీ కాలనీ, దేవా నగరం, సి.కత్తిగూడెం ఇలా అనేక గ్రామాల్లో విజృంభిస్తున్న విష జ్వరాల నుంచి కాపాడాలని జనం కోరుతున్నారు.



బాధితులతో నిండిపోయిన చర్ల సీహెచ్‌సీ